# "ఆశయం"

నిర్మల పుట్టింట్లో అడుగు పెడుతూనే తల్లిని వాటేసుకుని బావురుమంది. అసలే శోకసముద్రంలా వున్న ఆ ఇంటి వాతావరణం నిర్మల రాకతో మరింతగా పొంగి పొరలింది. "అమ్మా! అన్నయ్యని చివరి సారిగా చూసే అదృష్టం లేకపోయిందే నాకు." తనని ప్రాణాధికంగా అభిమానించిన అన్న రూపం కళ్ళల్లో మెదులుతుంటే అంది నిర్మల. "ఎవరు మాత్రం వాడి శవాన్ని చూడగలిగామే తల్లి. ఎంతో కష్టం మీద గుర్తించాం తప్ప నా బంగారు కొండ శిథిల శరీరాన్ని మాత్రమే మనకు అప్పగించారు." కొడుకుని తలుచుకొని గుండెలవిసేలా రోదిస్తుంది కామాక్షమ్మ.

ఇంతలో సుడిగాలిలా వాళ్ళమధ్యకు దూసుకొచ్చింది యశోదమ్మ. ఆవిడని చూస్తూనే కంపించిపోయింది నిర్మల. దుఃఖంతో పాటు నిర్మల పట్ల కసి, కోపం యశోదమ్మ అణువణువునా నిండిపోయాయి. "నీ మూలానే మహాతల్లీ ఇంతా జరిగి పోయింది. నా కూతురు పసుపు కుంకుమలు చెరిపేశావు. దాని బతుకు బండలు చేశావు. నువ్వు, మీ అన్న నా కూతురిని మాటలతో మంత్రించి వలలో వేసుకున్నారు కదే!" నిర్మలని నోటి కొచ్చినట్టు ఏవేవో అంటూ స్పృహతప్పి పడిపోయిందావిడ. దగ్గరి బంధువులు ఆమె చుట్టూ చేరి ముఖం మీద నీళ్ళు చల్లి వెచ్చని పాలు తాగించి తెలివి తెప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

"అమ్మా! కామాక్షమ్మా ముందు మీ కూతురిని ఆవిడ కళ్ళ పడనీయకండి. ఆవిడ గుండె అల్లుడు పోవడంతో బలహీనమై పోయింది." అంది ఓ ఆమె. "నా అక్కను పిల్లలకు తల్లిగా, భర్తకు భార్యగా బ్రతకనివ్వరా," నిష్టూరాలాడింది యశోదమ్మ చెల్లెలు. "చెట్టంత కొడుకుని పోగొట్టుకుని నేనూ కడుపు కోత భరిస్తున్నానమ్మా. ఎవరమూ కావాలని చేసింది కాదు. చావు

పుట్టుకలు మన చేతుల్లో వున్నాయా.'' తన దుఃఖాన్ని దిగమింగుకుంటూ వేదాంతిలా అంది కామాక్షమ్మ. కాస్త సత్తువ వచ్చేసరికి యశోదమ్మలోని ఆవేశం మళ్ళీ కట్టలు తెంచుకుంది. ''అలాగే మాట్లాడుతావమ్మా. నంగనాచిలా నీ కొంగు వెనకాల దాక్కుని కల్లబొల్లి ఏడ్పులు ఏడవవడం లేదు. నాకు సమాధానం చెప్పమను దాన్ని. అన్నగారికి ఎక్కడ పెళ్ళి కాదో అని అమాయకురాలైన నా కూతురితో అతి స్నేహం చేసి నా బంగారు తల్లిని చెడగొట్టింది. నిశ్చల ఎప్పుడూ నామాట దాటేది కాదు. అలాంటిది దీని అన్నగారిని తప్ప ఎవరినీ చేసుకోనని ఎంత వాదించింది. ఆ మిలటరీ మహానుభావుడు పట్టుమని పదినెలలైనా ఏం కాపురం చేస్తాడని దానికా పట్టుదల. అతగాడక్కడ ఏమంచుకొండల్లోనో చస్తుంటే ఇదిక్కడ మొగుడు కోసం ఎదురుచూస్తూ పడిగాపులు పడాలి. ఈడూ జోడుగా కళ్ళముందు తిరిగేదెప్పుడని ఆ మహానుభావున్ని కట్టుకోవద్దని, శతపోరానే. విందా! వాణ్ని కట్టుకొని దాని బ్రతుకు బుగ్గి చేసుకుంది. మూడు పదులు నిండకుండానే వైధవ్యం కొని తెచ్చుకొంది. పసిగుడ్డుతో ఈ బతుకు ఎలా ఈడుస్తుంది? దాని ఉసురుపోసుకుంది. ఊరికే పోతుందా? ఇంతకింతా అనుభవించి తీరుతుంది. ఆ దేవుడేం తక్కువవాడా? దీని పుస్తెలూ పుట్టుక్కున తెంపేస్తాడు. అప్పటికి నాకసి తీరుతుంది.'' నిర్మల అదిరిపడింది.

ఏమిటీవిడ? ఎంత దుఃఖంలో అయితే మాత్రం ఇలా శాపనార్ధాలు పెట్టాలా? ఇంతకీ తనేం చేసింది? తానావిడకంటికి హంతకురాల్లా కనిపిస్తోంది. ఒక ఊపిరి ఆగిపోతే, ఒకరి ప్రాణం ఎగిరిపోతే ఎంతో మందికి తీరని దుఃఖం కలుగుతుంది. నిశ్చలకి భర్తపోతే, తను ప్రాణాధికం అయిన అన్నయ్యను కోల్పోలేదా? వదిన అన్నయ్యల అనుబంధానికి రెండేళ్ళే మరి తను! తప్పటడుగులు వేస్తున్నప్పటి నుంచి అన్నయ్య చెయ్యి పట్టుకొని నడిపించాడు. ఎప్పుడూ సరదాకైనా పోట్లాడుకోలేదు. అమ్మనాన్న తను యిద్దర్నీ చూసుకొంటూ ఎంత మురిసిపోయేవాళ్ళు. మన కుటుంబంలో అన్యోన్యత, అనురాగాలు పెరటిలో పెరిగిన కల్ప వృక్షాలు అనేవారు నాన్న. తాతయ్య గురించి చెబుతూ - తాతయ్య గాంధీజీ అనుచరులని, స్వాతంత్రోద్యమంలో పాల్గొనే వారని చెబుతున్నప్పుడు అన్నయ్య పులకించి పోయేవాడు. నేను దేశం కోసం ఏదైనా చేస్తాను అనేవాడు. పసితనంలోని ఆ ఊహలు పెద్దవాడైనా అన్నయ్యలో స్వార్థానికి చోటివ్వలేదు. అవి అలాగే నిలిచిపోయాయి. వాడిలో అణువణువున నిండిన ఆ దేశభక్తే వాడిని, మాతృభూమి రక్షణకు అంకితం చేసింది. సాధారణంగా యువతని ఉర్రూతలూగించే సరదాల గురించి పెళ్ళి, గృహస్తు జీవితం అంటూ కలలు కనలేదు. వాడి ధోరణే వేరుగా ఉండేది. సరిహద్దులో మంచు కొండల్లో వాడు గడిపిన జీవితాన్ని గురించి

ఎంతో ఉత్సాహంగా చెబుతుంటే వాడు, గుండెనిండా మాతృదేశం పట్ల మమకారమే. కాశ్మీర్ అంటే అన్నయ్యకి పంచప్రాణాలు నాన్నగారిని ఎంతో పేచీపెట్టి ఎల్.టి.సి. మీద విహార యాత్రలు వెళ్ళినప్పుడు కాశ్మీరు వెళ్ళి తీరాలి అన్నాడు. అమ్మా నాన్నతో తామిద్దరూ ఆ వేసవి ఎంత హాయిగా గడిపారో, ఆ బాల్య స్మృతులు తనకెప్పటికీ మరపురావు. పాక్ వారి చూపు కాశ్మీర్ మీద ఉందని నాన్నారు చెప్పినప్పుడల్లా అన్నయ్య చలించి పోయేవాడు. ఏ దురాక్రమణా మనం సహించమని అందమైన కాశ్మీర్‌ని పరులసొత్తు కానివ్వం అని తరచు అనేవాడు. చివరికి అన్నయ్య ధ్యేయం అదే అయింది. కార్గిల్ కొండల్లో తన ప్రతాపాన్ని చూపి మరీ ప్రాణాలర్పించాడు. తను ప్రాణానికి ప్రాణం అయిన అన్నయ్యని కోల్పోయింది! చెల్లెమ్మ అంటూ ఆప్యాయత కురిపించే ఆ అనురాగ మూర్తి ఇక తనకు లేడు. తనే కుమిలి పోతుంటే ఈవిడ పాపిష్టి మాటలేమిటి? ఇంతకీ తనేం చేయగలదు? కావాలనే నిశ్చల వాడికి దగ్గరయ్యింది!' నీ తోటిదే, నా జీవితం అంది' అన్నయ్య వారించాడు కూడా. 'ప్రేమని స్నేహంగానే మిగిల్చుకో, స్నేహబంధం అయినా సాటిలేనిదేగా. నేను నిన్నేం సుఖ పెట్టగలను? ప్లీజ్! నువ్వు నా మీద ఆశలు పెంచుకోకు, నన్ను వీరమరణం వరిస్తే పశ్చాత్తాప పడతావు.' అన్నాడు కూడా. అప్పుడు నిశ్చల ఏమంది? 'నాకు పిరికి తనాన్ని నూరి పోయకు. నేనంత స్వార్థపరురాల్ని అనుకోకు. నాకు వీరపత్నినై గర్వించాలని ఉంది. ఇంతటి మన్మథ మూర్తివి. ఏవేవో ఊహించకుని నీలోని వలపుని సౌందర్యాన్ని అడవి కాచిన వెన్నెల చేస్తావా? అలా జరగనివ్వను. నువ్వు నాకు కావాలి. నీ చేతుల్లో ఒదిగి పోయి నీ సన్నిధిలో పులకించిన మధుర క్షణాలే నేను కోరుకునేది. నిన్ను చేసుకొని నా జన్మకి సార్థకత కల్పించుకుంటాను. నీ బిడ్డకు తల్లిని కాగల్గితే నా కోటి నోములు ఫలించినట్లే'' అంది. సూటిగా చెప్పింది. నిశ్చల మనోభావాలకి అన్నయ్య, నేను పొంగిపోయాం. అప్పుడూ యశోదమ్మ, ఇంతరగడా చేసింది. ఈ పెళ్ళి జరిగితే నుయ్యో గొయ్యో చూసుకుంటానంది. అమాయకురాలైన కూతురు గొంతు కోస్తున్నారంది. ఏమత్తుమందో జల్లి పెళ్ళి పేరిట దోచుకుపోతున్నారంది. ఇక అప్పుడయితే నేనూ అన్నయ్య. అమ్మ అంతా నచ్చజెప్పాం. నిశ్చలే తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. తన పంతం నెగ్గించుకుంది. తనకు వదినై పోయింది. నిశ్చల రాకతో అన్నయ్యలో ఎంతటి ఆనందమో. ఒక్క క్షణం వదిలేవాడు కాదు. వాడిలో చిన్నతనం ఉందా అనుకునేలా ఉండేది వాడి ప్రవర్తన.

తను తండ్రి కాబోతున్నాడని తెలుసుకున్న క్షణం వాడి సంతోషానికి అవధుల్లేవు. ఎంత హడావిడి చేశాడు. వదినకే కాక అమ్మకి, తనకి కూడా పట్టుచీరలు పట్టుకొచ్చేశాడు. తనే మామిడి కొమ్మలు కోసుకొచ్చి ద్వారాలకి తోరణాలు కట్టేసాడు. ''అమ్మ! నీ కోడలికి పూలజడవేయవే.

చెల్లాయ్ ! మీ వదినకి సీమంతపు పెళ్లి కూతురిలా ముస్తాబు చెయ్యవే. వాడి మమతలన్నీ మల్లెలై గుబాళించాడు. వాడి ఆశలన్నీ సన్నని గాజులై సవ్వడి చేశాయి. ఇల్లంతా ఎంత సందడి, అన్నయ్యకి ఎంతమురిపెం. " ఆగరా ఇప్పుడే కాదు ఇవన్నీ. ఓ నాలుగు నెలలు ఓపిక పట్టలేవా?" అంది ఎగతాళిగా, అమ్మైతే, "దేనికైనా సమయం సందర్భం ఉండొద్దట్రా కడుపులో పాపాయి కదిలి తల్లి మనసుకి గిలిగింతలు పెట్టాలి. ఆ అందంతో ఆనందంతో అమ్మాయి నిండుగా కనిపించాలి. అప్పుడు జరగాలిరా ఈ ముచ్చట!" చిరుకోపంతో అంది. ఏమోనమ్మాః నాకదంతా తెలీదు. మనింట్లో ఇవాళే పండుగ అయినా ఆ సమయానికి నేనుండనుగా!" ఆ మాటకి అమ్మ అదిరిపడింది. అవేంమాటలురా అప్రయత్నంగానే అమ్మ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. "అవునమ్మా ఏ క్షణాన సరిహద్దుల్లో ప్రమాదం ముంచుకొస్తుందో చెప్పలేం. నాకు శెలవు పొడిగించే అవకాశం ఉండకపోవచ్చు. అందుకే ఇలా అంటున్నాను., ఇంత మాత్రానికే కన్నీళ్ళెందుకమ్మా!" అమ్మ కళ్ళు తుడిచేశాడు. వాడు కోరినట్టే నిశ్చలని అలంకరించాం. నా స్నేహితురాళ్ళు ఓ పదిమందిని పిలిచేసి పేరంటం కూడా చేసేసాను. ఆ ముస్తాబులో వదినకి ఎన్ని ఫోటోలు తీసేసాడో! నిశ్చల కొంగుపట్టుకుని తిరుగుతుంటే భార్యని కళ్ళ నిండుగా చూసుకుంటూ అన్నయ్య పరవశించి పోతుంటే తనకి ఆశ్చర్యం కలిగింది. ఇంతకాలం అన్నయ్యలో పెల్లుబికే దేశభక్తినీ, దేశం కోసం ప్రాణాలైనా తృణప్రాయంగా త్యాగం చేయగలిగే ధృఢ నిశ్చయాన్ని చూసింది, తన అన్న అంతరంగపు అట్టడుగు పొరల్లో దాగి ఉన్న ప్రేమాపాశం ఇప్పుడూ తనని చకితురాల్ని చేస్తున్నాయ్. అందుకేనేమో స్త్రీని ప్రకృతితో పోలుస్తారు. ప్రకృతీ పురుషుల సంయోగం, నూతన సృష్టికి ఊపిరి పోస్తుంది. ఆ సంభ్రమాన్నే ఇప్పుడు తన అన్నా వదినెల్లో చూస్తున్నది. తనకింత వరకు అవగతం కాని గొప్ప రహస్యమేదో తెలుసుకున్నట్లు అనిపిస్తోంది. వాళ్ళు కేవలం తన అన్నావదినల్లానే కాక వాగర్థాలకు ప్రతిరూపమైన తన మనసులో నిలిచిపోయారు. దాంపత్య జీవితంలో ఇంతటి ఔన్నత్యం ఉందా? తను అలా ఆలోచిస్తూ ఉండగానే అన్నయ్యా వదినెల ప్రణయామృతం తన హృదయాన్ని తడిపేసింది. "నిశ్చలా! నీలాంటి అందాల రాశిని, బంగారు పాపని మాకు బహుమతిగా ఇవ్వాలి." అన్నయ్య మాటని వారిస్తూ వదిన అంటోంది. "మీలాంటి మరోవీరుడికే తల్లిని కావాలనుకుంటున్నాను. మంచితనం, మానవత్వం నింపుకొని వాడు పెరగాలి" అంటోంది. " అయితే నీ కొడుకు పెద్దమిలిటరీ ఆఫీసరన్నమాట, నీ కొడుకు అనకూడదు, మన బాబూ అనాలి. మీ రక్తమేగా ఆ వీరత్వం, దీక్ష వాడి అణువణువులోనూ నిండిపోదూ, తప్పక మిలిటరీ ఆఫీసరౌతాడు. మీలానే వాడు కూడా దేశం కోసం ప్రాణం కూడా ఇస్తానంటాడు. ఇంతకీ అమ్మాయిని కననంటావు. ఎలా అంటుంది? అన్నయ్య అమ్మాయైతే మరో ఝాన్సీవో, రుద్రమో కాకూడదా?"

అంటూ వాళ్ళ మధ్యకెళ్ళింది తను. "అవును సుమా! నాకు ఆలోచననే రాలేదు. ఎవరైనా నేను అలానే పిలుస్తాను. మీ అన్నయ్య ఆశయాలకు ప్రతిరూపంగా దేశానికి మరో వజ్రాన్ని అందిస్తాను." వదిన కళ్ళల్లో రవ్వంత గర్వం, అన్నయ్య ముఖంలో వింతకాంతి, ఇవన్నీ తలపుకొస్తే ఈ క్షణమే కళ్ళముందు జరుగుతున్నట్లు అనిపిస్తుంది. పచ్చగా కాపురం చేసుకోవలసిన పడుచు జంట బ్రతుకులు ఇలా మసిగా మారిపోయిన ఈ దుస్సంఘటన తన మనసునూ పిండేస్తోంది. కాలం ఎంత కఠినమైనది. అన్నయ్య ఆశయం ఇలా నెరవేరింది. కార్గిల్ యుద్ధ భూమిలో ప్రాణాన్ని కోల్పోయి, మోడుగా మిగిలింది. తను ఈ ఆవేదన భరించలేకపోతుంది. అయితే ఇదంతా తనమూలానే జరిగినట్లు దుమ్మెత్తి పోయటం యశోదమ్మకి న్యాయమేనా. ఒక వైపు అన్నయ్య తలపులు మరోవైపు ఈవిడ నిందారోపణలు, ఏమిటో తనకి పిచ్చెక్కేలా ఉంది. తలపట్టుకుంది నిర్మల, యశోదమ్మ మాత్రం సోకింతలు పెడుతూ నిర్మలని నోటికొచ్చినట్లు అంటోంది. బంధు మిత్రులు వస్తున్నారూ, వెళ్తున్నారు. ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు. నిజానికి ప్రాణాలకు తెగించి సైన్యంలో చేరిన వాళ్ళు పెళ్ళీ పెటాకులు ఎందుకు చేసుకోవాలి. పాపం ఆపిల్లని ఉసిగొల్పి తన అన్నయ్య ప్రేమలో పడేసిందంటే అంతా ఆ పిల్లవేసిన ఎత్తే."యశోదమ్మ బాధపడుతూ తిడుతోందంటే తిట్టదూమరి! ఏ అచ్చటా ముచ్చటా తీరకుండానే కూతురు భర్తని పోగొట్టుకుందంటే ఏ తల్లయినా సహించగలదా" అంటూ యశోదమ్మకి వత్తాసు పలుకుతున్నవాళ్ళు లేకపోలేదు. గుండెలో కరుడుకట్టిన దుఃఖం పట్టలేక పోతోంది. మేం ఎంతమందిమి ఎన్ని రకాలుగా ఓదార్చినా ఆ తల్లి దుఃఖం తీర్చగలమా." సానుభూతి కురిపించిందో పెద్దావిడ. "అదే ఇకవద్దంటున్నాను. మీరంతా తలోమాటా అనడం, అమ్మ నా ఆడపడుచుని నిష్టూరాలాడటం నేనే సహించను. నాయీ పరిస్థితికి కారకురాలిని నేనా. నా నిండు జీవితం నిరంజన్‌కి అంకితం చేశాను. పసుపు కుంకుమలతో భర్తనీడలో బ్రతుకు పండినా పతిదేవుడు వీరమరణం పొంది విధి వక్రించినా ఎదురీదాలనే నిశ్చయించుకొని సంసార జీవితంలో అడుగుపెట్టాను. నిజానికి నేను ఈ పెళ్ళి చేసుకోవటం నిర్మల ఇష్టపడలేదు. నేను హృదయపూర్వకంగా నిరంజన్‌ని నా భర్తగా ఆహ్వానించాను. మీరెవ్వరూ నా కోసం తల్లడిల్లిపోవలసిన పనిలేదు. ఈ బాబుకి జన్మనిచ్చి నిరంజన్ ఆశయం నెరవేర్చగలుగుతున్నానంటే నా జన్మ తరించిందనే అనుకుంటాను. ఈ పసివాడిని పెంచి పెద్ద చేయటంలోనే నా జీవిత లక్ష్యం ఇమిడి ఉంది, నా ప్రాణానికి ప్రాణమైన నిరంజన్‌ని వీడిలోనే చూసుకోగలను. "పసివాణ్ణి ఓముద్దు పెట్టుకుంది. వదిన నిశ్చలలోని అత్యున్నతమైన భావాలకూ, ఆమెలోని ధైర్యస్థైర్యాలకు నివ్వెరపోయి అంది నిర్మల. "అవునమ్మా! ఇంతవరకు నానించి నువ్వెన్నో మాటలు పడ్డావు. అవేవి మనసులో పెట్టుకోకు." వదిన అలా మాట్లాడుతుంటే

నిర్మలకి దుఃఖం ఆగలేదు. వదినా! అన్నయ్య మనకిక లేడు." బోరున ఏడ్చేసింది. "పిచ్చిదాన మీ అన్నయ్య నా గుండెలోనే ఉన్నారమ్మ! ఆయన మనందరిలోనే కలిసి పోయారు. మాతృభూమి రుణం తీర్చుకుని దేశంలోని ప్రతీ.అణువులోనూ నిండిపోయినా వారెక్కడికి పోయారమ్మా. ఇదిగో చూడు ముద్దారా లాలించమంటూ నీ అన్నయ్య నీ పొత్తిళ్ళల్లో వొదిగిపోతానంటున్నాడు." నిండు హృదయంతో నిర్మల వడిలో తన కొడుకుని ఉంచింది నిశ్చల.

❑